# బాధ్యత

**శిథిలావస్థలో** ఉందా ఇల్లు.

“ముఖలింగం గారిల్లు ఇదేనా?” గేటు తీసుకుని లోపలకొస్తూ అడిగాడో యువకుడు.

వీధి చావడిలో తుంగ చాపమీద కూర్చుని చదువుకుంటున్న నీరజ తలెత్తి చూసింది.

ఆ వ్యక్తికి ముప్పై ఏళ్ళుంటాయి. ఎర్రగా, సన్నగా ఉన్నాడు. చేతిలో బ్రీఫ్‌కేస్, నలిగిన దుస్తులు, చెదిరిన క్రాఫ్‌ను బట్టి అతడెంతో దూరం నుండి వచ్చాడని చెప్పవచ్చు.

“రండి నాన్నగారిని పిలుస్తాను. మడత కుర్చీవాల్చి లోపలకు నడిచింది నీరజ.

ఆ పిల్లకు పదహారేళ్ళ కంటే ఎక్కువ ఉండవు. ఎర్రపరికిణీ, పువ్వుల వోణీలో రేకులు విచ్చుకున్న పద్మంలా ఉంది.

అతడు కుర్చీలో కూలబడుతూ ఉండగా ముఖలింగం వచ్చాడు.

“నమస్కారం” “కూర్చోండి”

“నన్ను నారాయణ అంటారు. హైదరాబాద్ నుండి వస్తున్నాను. మీ కైలాసం నేను ఒకే ఆఫీసులో పనిచేస్తున్నాం.” స్వపరిచయం చేసుకున్నాడా వ్యక్తి.

“అన్నయ్య కులాసాయేనా?” ముఖలింగం కంఠంలో రవంత ఆదుర్దా.

“ఆఁ అంతా కులాసాయే. మిమ్మల్ని స్వయంగా కలుసుకుని మీకీ ఉత్తరం ఇమ్మని మరీమరీ చెప్పాడు. ఈ దగ్గర్లోనే ఉన్న ఎలమంచిలే మా స్వస్థలం.” అంటూ జేబులోనుండి కవరు తీసి అతడికందించాడు.

కవరు చించి ఉత్తరం చదవడంలో లీనమయ్యాడు ముఖలింగం.

ఆ ఇంటిని, ముఖలింగాన్ని మార్చి మార్చి చూశాడు నారాయణ.

బీటలు వారిన గోడలతో ఆ కొంప నేడో రేపో కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. మరమ్మతు చేయించుకోవడానికి కూడా వారికి స్థోమత ఉన్నట్లు లేదు.

ముందు గదిలో పడుకున్న ఓ వృద్ధురాలు ఖంగుఖంగుమని దగ్గుతోంది. బహుశా ఆవిడ ముఖలింగంగారి తల్లై ఉంటుంది. పాపం అస్తమా పేషెంట్ కాబోలనుకున్నాడు.

నడుముకు చిన్న గవంచా చుట్టుకున్న పన్నెండేళ్ళ కుర్రవాడొకడు గ్లాసుతో నీళ్ళు పట్టుకొచ్చి ఆవిడకిచ్చాడు.

గొంతు తడుపుకుని సేద తీర్చుకుందామె.

ఆ ఇంట్లో మచ్చుకైనా ఖరీదైన వస్తువేదీ కానరావడం లేదు.

పేదరికానికి ప్రతీకగా నిలిచిన ఆ ఇంటిని, జీవచ్ఛవాల్లా గోచరిస్తున్న ఆ ఇంట్లోని మనుషుల్ని చూస్తూ ఉంటే కడుపులో కెలికినట్లయింది నారాయణకి.

హ్యాండిల్ లేని గాజుకప్పుతో కాఫీ పట్టుకొచ్చి నారాయణకిచ్చిందో నడివయస్కురాలు.

ముతక చేనేత చీరలో సన్నగా కంపలా ఉందామె. నుదుటమీద అస్తవ్యస్తంగా పడి చెమటకు అంటుకు పోయిన ముంగురుల్ని చూస్తే గృహకృత్యాల్లో బాగా అలసిపోయినట్లు కనబడుతోంది. ఆమె ముఖలింగంగారి సతీమణే అందులో సందేహం లేదు.

కాఫీ చల్లగా ఉండడంతో గబగబా తాగేసి ఆలోచనలో పడ్డాడు నారాయణ.

ముఖలింగం, కైలాసం ఒకే రక్తం పంచుకుని పుట్టారు. అయితే ఇరువురిలో ఎంత తేడా? కైలాసం చేసేది గుమస్తాగిరే అయినా ఆఫీసర్లు అతడిముందు బలాదూర్. రోజుకొక దుస్తుల జతతో దొరబాబులా కనిపిస్తాడు. ఈ మధ్యే అతడు హైదరాబాద్‌లో పెద్ద బిల్డింగ్ కట్టించాడు. గృహప్రవేశానికి రమ్మని ఉత్తరం రాసి తన చేతికిచ్చాడు. ఎటూ ఆ దారినే తను ఎలమంచిలి వెళ్లవలసి ఉండడంతో అతడి అభ్యర్థనను కాదనలేకపోయాడు.

"గృహప్రవేశానికి తప్పకుండా వస్తానని అన్నయ్యతో చెప్పండి" ఉత్తరం చదివి మడతపెడుతూ అన్నాడు ముఖలింగం.

"మీరేం చేస్తూ ఉంటారు?" ఉండబట్టలేక అడిగాడు నారాయణ.

"ఈ ఊళ్లోనే టీచరుగా పనిచేస్తున్నాను"

ఉపాధ్యాయుల జీతాలు అంత అధ్వాన్నంగా లేవిప్పుడు. కావాలనుకుంటే పది మందికి ట్యూషన్లు చెప్పుకోవచ్చు. మరి అతడెందుకంత హీనస్థితిలో ఉన్నాడో అర్థం కావడం లేదు నారాయణకి.

"మీ అన్నయ్యగారు నాలుగు లక్షలు పెట్టి బ్రహ్మాండమైన ఇల్లు కట్టారు. మరి మీరింతవరకు..." అంటూ ఆగాడు నారాయణ. ముఖలింగం గురించి కొంతైనా తెలుసుకోవాలన్న తపన అతడి కళ్లల్లో ద్యోతకమౌతోంది.

"ఎవరి అదృష్టం వారిది. భగవంతుడు ఎవరికి ఎంత రాసిపెడతాడో?"

వైరాగ్యం, నైరాశ్యం అతడి పలుకుల్లో మిళితమై ఉన్నాయి.

"ఇక నాకు సెలవిప్పిస్తే..." లేచి నిలబడ్డాడు నారాయణ.

"అపరార్ణవేళ వచ్చారు. భోజనం చేసి వెడితే మాకు తృప్తిగా ఉంటుంది" అన్నాడు ముఖలింగం.

"మీరా మాట అంటారని నాకు తెలుసు. మరోసారి తప్పకుండా వస్తాను. ప్రస్తుతానికి నన్ను వదిలేయండి. త్వరగా మా ఊరు వెళ్లాలి."

"సరే మీ ఇష్టం. మాటల్లో పడి మా కుటుంబ సభ్యుల్ని పరిచయం చేయడం మరిచాను. ఈవిడ నాభార్య సత్యాదేవి. వాళ్లిద్దరూ నా చిరంజీవులు నీరజ, వాసు. మంచం మీద ఉన్న ఆవిడ నా మాతృమూర్తి. నా చిన్నతనంలోనే మా తండ్రిగారు కాలంచేశారు. చెల్లెల్లిద్దరికీ వివాహాలు అయిపోవడంతో వాళ్లు అత్తవారిళ్లకు వెళ్ళిపోయారు." ఇంట్లో వాళ్ళందర్నీ పరిచయం చేశాడు ముఖలింగం.

అతడి ఆదరణకు, ఆప్యాయతకు ముగ్ధుడయ్యాడు నారాయణ.

నారాయణ గుమ్మం దాటగానే దీర్ఘాలోచనలో పడ్డాడు ముఖలింగం. అతడి మస్తిష్కంలో నారాయణ మాటలు పదేపదే ప్రతి ధ్వనిస్తున్నాయి.

★ ★ ★

కైలాశం కాలేజీలో అడుగుపెట్టగానే తండ్రి లక్ష్మీపతి కాలం చేశాడు. ముఖలింగం తొమ్మిదో తరగతి చదూతున్నాడు. గాయత్రి, భవాని పసివాళ్ళు. లక్ష్మీపతిది ప్రభుత్వోద్యోగం కానందున ఆ కుటుంబానికి పెన్షన్ లాంటి సదుపాయమేవమీ సమకూరలేదు. పిల్లల్ని ఎలా పెంచి పెద్ద చేయాలో తెలియలేదు జగదాంబకి. ఇంటిని రెండు భాగాలు చేసి ఓ భాగం అద్దెకిచ్చి ప్రావిడెంట్ ఫండ్ రూపంలో కంపెనీ వారు చెల్లించిన ముప్ఫైవేలు బ్యాంకులో వేసుకుని పిల్లల్ని చదివించసాగింది.

కైలాసం గ్రాడ్యుయేటయ్యాడు. టైపు, షార్ట్‌హ్యాండ్ పాసు కావడంతో సులువుగా గవర్నమెంట్ ఉద్యోగం దొరికింది.

పెద్దవాడు చేతికందినందుకు మురిసిపోయింది జగదాంబ. వాడు ప్రతినెలా అంతో ఇంతో పంపిస్తే ముఖలింగం చదువుకు అంతరాయమేర్పడదని భావించింది. ఉద్యోగమైన తొలిదినాల్లో మూడొందలు పంపించేవాడు కైలాసం. ఆ తర్వాత అతడి నుండి ఆర్థిక సహాయం ఆగిపోవడంతో ముఖలింగం చదువు అర్ధంతరంగా ముగిసిపోయింది. ఉపాధి కోసం ఇంటర్ పూర్తి అవడంతోనే టీచర్ ట్రైనింగ్‌లో చేరాడు.

కైలాసం తోబుట్టువులను పట్టించుకోకపోవడంతో నిశ్శబ్ధంగా కంటతడి పెట్టింది జగదాంబ.

తల్లి గుండెల్లో రగులుతున్న మంటల్ని ఆర్పడానికి ప్రయత్నించాడు ముఖలింగం.

"నేనున్నానమ్మా నీకేం భయం లే"దంటూ ఆమె నోదార్చాడు.

ట్రైనింగు పూర్తి చేసిన ముఖలింగానికి అదృష్టవశాత్తు ఆ ఊళ్ళోనే ఉద్యోగమైంది.

కైలాసం ఎవరికీ చెప్పాపెట్టకుండా తనకు నచ్చిన అమ్మాయిని గుళ్ళో పెళ్ళిచేసుకున్నాడు.

విషయం తెలుసుకుని మౌనంగా రోదించింది జగదాంబ.

ఆ రోజునుండీ కుటుంబ బాధ్యతల్ని తన నెత్తిన వేసుకున్నాడు ముఖలింగం. జీతంలో సగం వెనకేసి చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు చేశాడు. వాళ్ళ ముద్దు ముచ్చట తీర్చేందుకు ఇంటిమీద అప్పుచేశాడు.

తోబుట్టువుల పెళ్ళిళ్ళకు పెద్దరికం వహించడం తప్ప పైసా సహాయం చేయలేదు కైలాసం.

గాయత్రి, భవాని పిల్లల తల్లులైనా ఏదో ఒక వంక పెట్టుకుని తరచు పుట్టింటికి వస్తూ ఉండేవారు.

వచ్చిన వాళ్ళను ఉత్త చేతుల్తో పంపిస్తే బాగుండదనేది జగదాంబ. వాళ్ళు వచ్చినప్పుడల్లా కొత్త బట్టలు కొని పట్టుకొచ్చేవాడు. ఖర్చులతో పాటు అప్పులు పెరిగాయి. ఇల్లు బాగుచేయడానికి సొమ్ము లేకపోవడంతో అది శిథిలావస్థకు చేరుకుంది. అద్దెకున్న వాళ్ళు ఆ ఇంట్లో ఉండలేక

ఖాళీ చేసేశారు.

రాబడి తగ్గినా ఇంట్లో ఎవరికీ ఏ లోటూ లేకుండా చేసుకొస్తున్నాడు ముఖలింగం. అయితే అది వాడి బాధ్యత అనుకునేదే తప్ప కొడుకు మీద సానుభూతి లేదు జగదాంబకి. పైగా ప్రతిదీ పద్ధతి ప్రకారం జరగాలనని పట్టుబట్టేది.

పండుగ అడ్వాన్సు అందుకున్న ముఖలింగం... కట్టిన చీరే తడిపి కట్టుకుంటూ కాలక్షేపం చేస్తున్న భార్యకు నాలుగు వాయిల్ చీరలు, కన్నకూతురికి రెండు ఫ్రాకులు కొనాలనుకున్నాడు. ఎన్నడూ తనకిది కావాలని నోరు విడిచి అడగని సత్యకు తనెంత ద్రోహం చేస్తున్నాడో అతడికి తెలుసు. అందుకే అవసరాలను వెనక్కి నెట్టి ఆ నిర్ణయానికొచ్చాడు.

"గాయత్రి తన కొడుక్కి పుట్టినరోజని రాసింది. నువ్వెలాగూ అంత దూరం వెళ్ళలేవు. వెంటనే ఓ ఐదొందలు మనియార్డరు చెయ్యి" బాంబుపేల్చింది జగదాంబ.

కట్టుకున్న వాళ్ళ కనీస అవసరాలను పక్కకు నెట్టలేక, తల్లి మాట జవదాటలేక అడకత్తెరలో పోకచెక్క మాదిరి నలిగిపోయాడు ముఖలింగం.

"చెల్లెలికి పంపడానికి డబ్బు లేదని చెప్పి పెళ్ళానికి చీర కొంటే ఏం బావుంటుంది చెప్పండి. ముందు ఆ డబ్బు గాయత్రికి పంపించండి" సలహా ఇచ్చింది సత్యాదేవి.

"నాకు గౌన్లు ఉన్నాయి నాన్నా. ఇంకెప్పుడైనా కొనుక్కోవచ్చులే" అన్నది నీరజ ముద్దుముద్దుగా.

కూతురి మాటలకు ముఖలింగం కళ్ళ వెంబడి నీళ్ళు చిప్పిల్లాయి. నీరజను దగ్గరకు తీసుకుని ఆమె ముఖమంతా ముద్దులతో ముంచెత్తాడు.

ఆ రోజు ఫస్టు.

ఎవరెవరకి ఎంతెంత ఇవ్వాలో నిమ్మళంగా ఉంటే రుద్రాభిషేకం చేయిస్తాననని మొక్కుకున్నాను. ముందాపని చూడు" తల్లి ఆజ్ఞను ఆచరణలో పెట్టాడు ముఖలింగం మరి ముందు వెనక ఆలోచించకుండా.

కాలప్రవాహంలో కొనేళ్లు కొట్టుకుపోయాయి.

తల్లి మరేదో ఖర్చు చూపిస్తే... "నీరజ ఎదుగుతోందమ్మా. దాని పెళ్ళికోసం వెయ్యి రూపాయలు ఆర్.డి. కట్టాలనుకుంటున్నాను" అన్నాడు తెగించి ముఖలింగం.

ఇప్పుడప్పుడే దాని పెళ్ళిగురించి ఆలోచన పెట్టుకోకు. నిండా దానికి పన్నెండేళ్ళైనా లేవు. ప్రతి నెలా వెయ్యి రూపాయలు బ్యాంకులో వేసేస్తే ఇల్లెలా గడుస్తుందనుకుంటున్నావ్?" అంది జగదాంబ.

"కొన్ని ఖర్చులు తగ్గించుకుంటే బావుంటుందేమో!"

"నీ సంపాదనంతా మాకు పెట్టిస్తున్నావని బాధపడితే నేనేమీ చెప్పలేను. గాయత్రి, భవాని నీ తోబుట్టువులన్న సంగతి మరచిపోకు. ఈ పండుగకైనా గాయత్రిని పిలిచి అది ఎప్పటి నుండో కోరుకుంటున్న టి.వి. కొనిపెట్టు. తండ్రిలేని ఆడపిల్లలు. కైలాసం ఆ కొరత తీరుస్తాడేమోనని ఆశపడితే వాడలా తయారయ్యాడు. ఆదరించే అన్నదమ్ముల దగ్గరకే ఆడపిల్లలు వస్తారన్న సంగతి మరచిపోకు" అంటూ కంట తడిపెట్టింది జగదాంబ.

మరేమాట చెప్పడానికి నోరురాక "అలాగే" అంటూ అక్కడ నుండి నిష్క్రమించాడు ముఖలింగం.

"మీ నాన్నగారి అబ్దీకానికి ఈ ఏడు భోక్తకు పట్టు పంచె కొనివ్వు. నువ్వింత వాడివయ్యావంటే అదంతా ఆయన ఆశీస్సులే బాబు అన్నది జగదాంబ అప్పుడే ఏవో ఎరియర్స్ అందుకుని ఇంటికొచ్చిన కొడుకుతో.

"నువ్వంతగా చెప్పాలమ్మా. నాన్నగారి విషయంలో నేను ఎప్పుడూ వెనుకాడను" అన్నాడు ముఖలింగం.

"ఏమోరా చెప్పుడు మాటలకు నీ మనసెక్కడ మారిపోతుందోనని భయంగా ఉంది" అంటూ కోడలి వంక క్రీగంట చూసింది జగదాంబ.

అత్తగారంటించిన చురకకు చివుక్కుమన్నది సత్య మనసు.

తల్లి ఆదేశాల్ని పాటిస్తూ ఎవరికీ ఏ లోటూ రాకుండా చూడటంలో ఇరవై వసంతాలు ఇట్టే కరిగిపోయాయి.

వయసు మీదపడటంతో మంచమెక్కింది జగదాంబ. ఆవిడకు ఉబ్బస అని తేల్చి చెప్పారు వైద్యులు. కన్న కూతురు పెళ్లికెదిగి కూర్చుంది. కొడుకు హైస్కూల్లో చేరాడు. ఖర్చులు పెరిగాయి. రాబడి తగ్గింది. అప్పులలాగే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితులలో తను అన్నయ్యలా ఎలా ఉండగలుగుతాడు? బాధ్యతలు మనిషిని కృంగదీస్తాయంటారు. అందుకేనేమో నలభై ఏళ్ళ ముఖలింగం ఎనభై ఏళ్ళ వాడిలా కనిపిస్తాడు.

గతం కళ్ళ ముందు మెదిలి నేత్రాలు నిండుకుండలయ్యాయి.

గృహ ప్రవేశ మహోత్సవానికి హాజరయేందుకు భాగ్యనగరం చేరుకున్నాడు ముఖలింగం.

రాజధానిలో దిగుతూనే కైలాసం రాసిన ఉత్తరాన్ని బయటకు తీసి చిరునామా చూసుకుని ఆటో ఎక్కాడు.

పావుగంటలో ముఖలింగం చెప్పిన ఇంటిముందు ఆగింది ఆటో.

మేళతాళాలు మ్రోగవలసిన ఆ ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. బంధుమిత్రులతో కళకళలాడవలసిన ఆ లోగిలి అత్యంత నిర్మానుష్యంగా కనిపించింది.

ఆటో దిగి లోపలకు వెళ్ళబోయి గేటుకు వేసి ఉన్న తాళం కప్ప చూసి హతాశుడయ్యాడు. అడ్రసు తారుమారు అయిందేమో ననుకుని మళ్ళీ ఉత్తరం తీసి చిరునామా చూశాడు. సరిగ్గానే ఉంది. ఏం చేయాలో తోచక వచ్చిన ఆటోలోనే కైలాసం పనిచేసే ఆఫీసుకెళ్ళాడు.

కైలాసం అక్రమ సంపాదనను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అతడిని ఉద్యోగం నుంచి తొలగించిందని, ముఖం ఎవరికీ చూపలేక కైలాసం ఆలుబిడ్డలతో ఊరు విడిచి వెళ్ళిపోయాడని తెలిసి నీరైపోయాడు ముఖలింగం.

అన్నయ్య ఆచూకీ తెలుసుకునే అవకాశం లేకపోవడంతో తిరుగు ముఖం పట్టాడు.

ముఖలింగం ఊర్లో అడుగుపెట్టాడో లేదో "నీకో శుభవార్త" అన్నాడు లాట్రీతాత.

ప్రశ్నార్థకంగా ముఖం పెట్టాడు ముఖలింగం.

పట్నం నుండి లాట్రీ టిక్కెట్లు పట్టుకొచ్చి గ్రామాల్లో అమ్ముతూ ఉండటం వల్ల అంతా అతడినీ లాట్రీ తాత అంటారు.

"ఆ మధ్య నీచేత కొనిపించిన టిక్కెట్టుకి యాభైవేలు పలికింది. నీకీ విషయం చెబుదామని మీ ఇంటికెళ్లాను. నువ్వేమో హైదరాబాదు వెళ్ళావని చెప్పారు" రొప్పుతూ అన్నాడు లాట్రీతాత.

పరారైన అన్నయ్య గురించి ఆలోచిస్తున్న ముఖలింగానికి ఆ శుభవార్త అణుమాత్రమైనా ఆనందాన్నివ్వలేదు.

ముఖలింగం నోటినుండి ఏ మాటా రాకపోవడంతో "చూడు లింగం, ఇన్నాళ్ళూ తల్లి అని తోబుట్టువులంటూ ఆర్జించిందంతా వాళ్ళ కోసమే ఖర్చు చేసి నీకంటూ ఏమీ మిగుల్చుకోకుండా కర్పూర కళికలా హరించుకు పోయావు. అనుకోకుండా నిన్ను అదృష్టం వరించింది. ఈ సొమ్ముతోనైనా కన్నకూతురి కళ్యాణం జరిపించి కట్టుకున్న వారికి న్యాయం చేకూర్చు" అంటూ బాధ్యతను గుర్తుచేశాడు లాట్రీతాత.

**(15-5-1997, మహిళ ఆంధ్రప్రభ డైలి అనుబంధం)**